
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 25 | జనవరి | 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కారుకొండ రమేష్ చౌదరి (మండపేట) రూ.67,500 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.75 అడుగులకు చేరింది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2023 మంగళవారం ప్రారంభమయ్యాయి.

8లో

న్యూస్‌రీల్

బాలికల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం



సభలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ దుర్గారావుదొర

అమలాపురం టౌన్: బాలికల విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణ, సంరక్షణ వంటి విషయాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గారావుదొర విద్యార్థినులకు బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో బాలికలు వివక్షకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. బాలికల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను ముమ్మిడివరం ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐసీడీఎస్ అమలాపురం సీడీపీఓ విజయకుమారి మాట్లాడుతూ, బాలికలు క్షేమంగా ఉంటేనే ఊళ్లు, ఇళ్లు శుభప్రదంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి షాలోమ్‌రాజు, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆర్గనైజేషన్ జిల్లా బాలల విభాగం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరోనా నాణేల సేకరణలో లిమ్కా బుక్ రికార్డ్



కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: కరోనా నాణేల సేకరణలో అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించారు. కరోనాపై 15 దేశాలు విడుదల చేసిన 18 నాణేలను సేకరించడం ద్వారా ఆయన ఈ రికార్డు సాధించారు. ఆస్ట్రేలియా, ఈజిప్ట్, ఫ్రాన్స్, జిబ్రాల్టర్, హంగేరి, ఇజ్రాయిల్, ఇటలీ, లిథువేనియా, మాల్టా, నియూ, రష్యా, సమోవ, శానిమారినో, ట్రాన్సిస్ట్రియా, ఉక్రెయిన్ దేశాలకు చెందిన కరోనా నాణేలను ఆయన సేకరించారు. తాను సేకరించిన మాల్టా దేశం కరోనా నాణెం చిత్రాన్ని కూడా లిమ్కా బుక్‌లో ప్రచురించారని కృష్ణ కామేశ్వర్ తెలిపారు. ఆయనను అమలాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వై.సత్యనారాయణమూర్తి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజేశ్వరి, సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు అభినందించారు.

ర్యాలిలో సాయిధన్సిక పూజలు



సాయి ధన్సికకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

ఆత్రేయపురం: ప్రముఖ సినీనటి సాయిధన్సిక ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి వారిని మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం అందజేశారు. సాయిధన్సిక కబాలి, వీరు, షికారు వంటి తెలుగు చిత్రాలతో పాటు తమిళ, కన్నడ చిత్రాల్లో నటించారు.

వీఆర్‌ఓ కృష్ణకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు



వీఆర్‌ఓ కృష్ణ

అమలాపురం టౌన్: నూరు శాతం ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేసినందుకు గాను అమలాపురం రూరల్ మండలం సాకుర్రు వీఆర్‌ఓ, గ్రామ బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌వో) ఎ.కృష్ణ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డుకు జిల్లాకు ఒకరిని చొప్పున రాష్ట్ర ఎన్నికల విభాగం ఎంపిక చేసింది. ఈ మేరకు కృష్ణకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డు స్వీకరించాల్సిందిగా ఆహ్వానించారు. వీఆర్‌ఓ కృష్ణను అమలాపురం తహసీల్దార్ పి.శ్రీపల్లవి అభినందించారు.



కోకోనట్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ నమూనా

హరిత సీమలో.. పారిశ్రామిక కాంతులు

- రూ.100 కోట్లతో కోకోనట్ పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం
- వ్యవసాయ, ఉద్యాన యూనిట్లకూ ప్రోత్సాహం
- జిల్లాలో ఇప్పటికే 536 చిన్న పరిశ్రమలు
- పీఎంఈజీపీలో మరో 90 పరిశ్రమల ఏర్పాటు లక్ష్యం
- రూ.20 కోట్లతో సీఎఫ్‌సీల ఏర్పాటుకూ రంగం సిద్ధం
- రైతులకు, చిన్న పారిశ్రామికవేత్తలకు మేలు

సాక్షి అమలాపురం: అపారంగా చమురు, సహజ వాయు నిక్షేపాలు.. వ్యవసాయం.. ఉద్యానం.. పాడి.. మత్స్య సంపద.. ఇసుక ర్యాంపులు.. ఇలా మన జిల్లా సహజ వనరుల ఖని. వీటికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అవసరానికి పదింతల ముడి సరకు స్థానికంగా లభ్యమవుతుంది. కానీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలున్నా.. భూమి లభ్యత లేనందున జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి చెప్పుకోదగిన స్థాయిలో లేని పరిస్థితి. జిల్లాలో ఓఎన్జీసీ, గెయిల్, రవ్వ వంటి చమురు సంస్థలు, కోనసీమ పవర్ లిమిటెడ్ వంటి పరిశ్రమలతో పాటు రొయ్యల కంపెనీలకు చెందిన కోల్డ్ స్టోరేజీలు, రైస్ మిల్లుల వంటివి మాత్రమే ఉన్నాయి. అంతకు మించి పెద్ద పరిశ్రమలు లేవు. ఇక్కడున్న వనరులకు ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశమున్నా ముందడుగు పడడం లేదు. దీనిని గుర్తించిన ప్రభుత్వం పూర్తి వ్యవసాయాధారితమైన మన జిల్లాలో.. ఒకవైపు చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తూనే.. మరోవైపు రైతులకు, పారిశ్రామికవేత్తలకు మేలు చేసేలా పెద్ద పరిశ్రమల స్థాపనకు ఏర్పాట్లు చేస్తోంది.

కొబ్బరి ఉప ఉత్పత్తుల పరిశ్రమ

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సుమారు 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరిగే ఈ జిల్లాలో రూ.100 కోట్లతో కొబ్బరి ఉప ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొబ్బరికి సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను ఇక్కడ తయారు చేయనున్నారు. ఈ ప్రతిపాదన ఏడాది క్రితమే వచ్చినా పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన స్థలం ఇక్కడ లభ్యం కాలేదు. కనీసం పదెకరాల స్థలం ఉన్నా పరిశ్రమ ఏర్పాటు చేయవచ్చని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.

చిన్న పరిశ్రమలకు అనుబంధంగా..

చిన్న పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి పెద్ద పరిశ్రమగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆయా ఉత్పత్తులకు చెందిన కుటీర, చిన్న పరిశ్రమలను వీటిలో భాగస్వామ్యం చేస్తారు. చిన్నచిన్న పరిశ్రమలకు అవసరమైన ముడి సరకు అందజేయడం, వారు తయారు చేసిన ఉత్పత్తులు నిల్వ చేయడం, ఏక మొత్తంగా మార్కెట్ చేయడానికి ఇవి దోహదపడతాయన్నది ప్రభుత్వ ఆలోచన. అలాగే ఇక్కడ పెద్ద యంత్రాలు ఏర్పాటు చేసి, ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ప్రభుత్వం ఒక్కో దానికీ రూ.10 కోట్ల చొప్పున రెండు సెంటర్లకు అనుమతి ఇచ్చింది. మామిడికుదురులో క్వాయర్, మండపేటలో పరుపుల పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 30 మంది చొప్పున చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు కలిసి క్లస్టర్‌గా ఏర్పడి, వ్యాపారం నిర్వహించనున్నారు. ఈ సెంటర్లకు ఏకంగా 95 శాతం రాయితీ అందించనున్నారు.

చిన్న పరిశ్రమలకు చేయూత

మైక్రో, స్మాల్ అండ్ మీడియం, ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ)ల ఆధ్వర్యాన జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 536 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పడ్డాయి. వీటిలో క్వాయర్, అట్ట పెట్టెల పరిశ్రమలతో పాటు స్వీట్ షాపులు, ఆహార పదార్థాల ఉత్పత్తి, పరుపుల తయారీ వంటి యూనిట్లు అధికంగా ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.14 కోట్లు కాగా, 1,500 మంది వరకూ ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. అలాగే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద జిల్లాలో 90 వరకూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 58 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కూడా క్వాయర్, పిండి మిల్లులు, సెంట్రింగ్, ఆటో మొబైల్ స్పేర్ పార్టుల వంటి పరిశ్రమలు ఉన్నాయి. వీటి విలువ రూ.5 కోట్ల వరకూ ఉంది.

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోంది. జిల్లాలో పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ సమస్యగా మారింది. ఇక్కడ భూముల ధరలు అధికంగా ఉన్నాయి. పెద్ద పరిశ్రమల లోటు తీర్చేందుకే కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.

– టి.మురళి, జిల్లా పరిశ్రమల అధికారి (ఎఫ్‌ఏసీ)



కోకోనట్ వాటర్ ప్లాంట్

ఉపాధి కూలీల సగటు వేతనంలో రాష్ట్రంలోనే ఫస్ట్



మాచవరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ మధుసూదనరావు

అంబాజీపేట: ఉపాధి హామీ పథకంలో కూలీల సగటు వేతనాల చెల్లింపులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందని డ్వామా పీడీ పి.మధుసూదనరావు తెలిపారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మాచవరం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో సగటు వేతనం రోజుకు రూ.244 చెల్లిస్తున్నామన్నారు. 1.57 లక్షల జాబ్ కార్డులున్నాయని, ప్రస్తుతం 9,237 మంది కూలీలు పనులు చేస్తున్నారని వివరించారు. 111 ఎకరాల కొబ్బరి తోటల్లో 1,872 మంది కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఒక్కో పళ్లెం ఏర్పాటుకు సగటున రూ.2.57 వస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.114.68 కోట్లతో వివిధ పనులు చేయిస్తూ 47.72 లక్షల పనిదినాలు కల్పిస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణాలకు సంబంధించి 90 రోజులు పనిదినాలు కల్పించామని, రోజు వేతనంగా రూ.257 కూలీకి చెల్లిస్తామని మధుసూదనరావు తెలిపారు. అంతకుముందు ఉపాధి కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. కూలీల మస్టర్లతో పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అడపా వెంకటకృష్ణ, టీఏ, జేఈ జి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రాణాలపై నిర్లక్ష్యం వద్దు



సభను ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో జిల్లా రవాణా అధికారి అశోక ప్రతాపరావు

- నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలి
- రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభలో ఎంపీ అనురాధ

అమలాపురం టౌన్: చిన్నపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, నిబంధనలకు లోబడి వాహనాలు నడిపితే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. జిల్లా స్థాయి రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు సభ స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ అనురాధ మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు మనపై ఆధారపడిన కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అవగాహన, చైతన్యంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఎక్కువగా లైసెన్సు లేని విద్యార్థులు, యువకులు నడిపే ద్విచక్ర వాహనాల వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రహదారి భద్రతపై పోలీసు, రవాణా, ట్రాఫిక్, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో 528 రోడ్డు ప్రమాదాలు జరగగా 208 మంది మృతి చెందారని తెలిపారు. అతి వేగం, నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌టేకింగ్, మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం వంటి తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఎంపీ అనురాధ, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు, ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో తృతీయ స్థానం



తృతీయ బహుమతి అందుకుంటున్న మానస

రావులపాలెం: ఏపీ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–19 విభాగంలో రావులపాలెం జూనియర్ కళాశాల విద్యార్థిని మానస తృతీయ స్థానం సాధించింది. కళాశాల పీడీ సీహెచ్ శ్రీనివాసరావు మంగళవారం ఈ విషయం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 20 నుంచి 23 వరకూ ఈ పోటీలు జరిగాయి. మానసను ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నెట్‌బాల్‌లోనూ తృతీయం

ఇటీవల నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్–19 బాలుర, బాలికల స్టేట్ మీట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నెట్‌బాల్ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. పీడీ శ్రీనివాసరావు ఈ విషయం తెలిపారు. జిల్లా నెట్‌బాల్ బాల, బాలికల జట్లలో తమ కళాశాలకు చెందిన బాలికలు రావూరి తరుణ సింధు, దాసరి ధనసాయి దీపిక, బత్తుల చందన, చిర్రా చాందిని, బాలురులో రావూరి కాశీవిశ్వనాథం, బందెల లీలాదుర్గాప్రసాద్, కల్లూరి కిరణ్ దుర్గా శివనారాయణ పాల్గొని, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. చాందిని, కాశీవిశ్వనాథం జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సప్తనదీ జలాభిషేకానికి సర్వం సిద్ధం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకూ మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధమైందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు మంగళవారం తెలిపారు. తొలి రోజు గణపతి కల్పం ప్రారంభంతో ఈ క్రతువులు మొదలవుతాయి. సప్తనదీ జలాభిషేకం, లక్ష కలాల వితరణ, విద్యార్థులతో సరస్వతీ పూజల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆహార ఉత్పత్తులకు రూ.3.56 కోట్ల సాయం

జైకా భారత దేశ ప్రతినిధి కాటో మారియా



నేదునూరులో కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న జైకా ప్రతినిధి కాటో మారియా

అంబాజీపేట: కొబ్బరిలో ఆహార ఉత్పత్తుల నిరంతర ఉత్పాదన, అదనపు విలువల ఆహార ఉత్పత్తులు, మౌలిక వసతుల కల్పనకు రూ.3.65 కోట్ల గ్రాంటు మంజూరు చేశామని జపాన్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ ఏజెన్సీ (జైకా) భారత దేశ ప్రతినిధి కాటో మారియా చెప్పారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. కొబ్బరిలో అదనపు ఆదాయం పొందేందుకు ఫుడ్ వాల్యూ ఎడిషన్‌లో భాగంగా కొబ్బరి బొండాల సైజు పెంచడం, అధునాత సాంకేతిక పద్ధతులు, నర్సరీల పెంపకం, ప్యాక్ హౌస్‌ల నిర్మాణం, కొబ్బరి క్లైంబర్స్ వంటివి ఉపయోగించాలన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్రానికి రూ.2 వేల కోట్లు మంజూరు చేశామని చెప్పారు. దీనిలో భాగంగా కృషీవల కంపెనీకి 90 శాతం గ్రాంటు మంజూరు చేశామని, మిగిలిన 10 శాతం కంపెనీ చెల్లించాలని తెలిపారు. ఈ పథకంలో భాగంగా కొబ్బరి నుంచి వర్జిన్ ఆయిల్, పాలు, కొబ్బరి బొగ్గులు తదితర ఉత్పత్తుల తయారీకి టెండర్లు కూడా పిలిచామని వివరించారు. కోనసీమతో పాటు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాలోని రెడ్డిగూడెంలో రూ.5 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ.14.75 కోట్లతో ఫుడ్ వేల్యూ నిరంతర ఆహార ఉత్పత్తులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అంతకుముందు అయినవిల్లి మండలం నేదునూరులో జైకా సాయంతో చేపడుతున్న మౌలిక వసతులను, ఫ్యాక్టరీ పనులను కాటో మారియా పరిశీలించారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చీఫ్ ఆపరేషన్స్ అధికారి తోట భరత్‌కుమార్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న నీటిపారుదల రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ రాఘవేశ్వరరావు, జైకా భారతీయ ప్రతినిధి అనురాగ్ సిన్హా, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నుంచి సజ్జా నాయక్, ఈఈ మోహనరావు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ షేక్ సబ్జాన్, జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు, ఏపీఎఫ్‌పీఎస్ జైకా నోడల్ అధికారి సీహెచ్ సాయి శ్రీనివాస్, కృషీవల కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతిరావు, డైరెక్టర్లు ముత్యాల జమ్మిలు, అడ్డాల గోపాలకృష్ణ, గోదశి నాగేశ్వరరావు, కె.ప్రసాదరాజు, ఆకాశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/గండేపల్లి/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2023 మంగళవారం ప్రారంభమయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యాన కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్ష కాకినాడ అయాన్ డిజిటల్ ఇనిస్టిట్యూట్, గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లలో నిర్వహించారు. అయాన్ ఇనిస్టిట్యూట్‌లో ఉదయం పరీక్షకు 516 మందికి గాను 513 మంది, మధ్యాహ్నం పరీక్షకు 515 మందికి గాను 509 మంది హాజరయ్యారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో తొలి రోజు పరీక్షకు 115 మందికి గాను 114 మంది హాజరయ్యారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో ఉదయం పరీక్షకు 900 మందికి గాను 892 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 900 మందికి గాను 889 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో కూడా జరుగుతాయి.

ఈ తనూజ.. నిజాయితీకి నిలువెత్తు చిరునామా..

- రూ.1.42 లక్షలు పోగొట్టుకున్న వృద్ధురాలు
- అందజేసిన మహిళ
- అభినందించిన పోలీసులు



తనూజను సత్కరిస్తున్న సీఐ వీరబాబు, ఎస్సై పరదేశి తదితరులు

అమలాపురం రూరల్: ఒకటీ రెండు రూపాయలు కాదు.. ఏకంగా రూ.1.42 లక్షలతో ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకుందో ఓ వృద్ధురాలు. అంత మొత్తంతో బ్యాగ్ దొరికితే చాలామందికి దురాశ పుట్టడం ఖాయం. కానీ, తనకు దొరికిన ఆ బ్యాగ్‌లో ఒక్క పైసా కూడా తీసుకోకుండా.. బాధిత వృద్ధురాలికి అందజేసి, నిజాయితీకి నిలువెత్తు చిరునామాగా నిలిచింది ఆ మహిళ. వివరాలివీ.. అంబాజీపేట శివారు కోశివారి అగ్రహారానికి చెందిన 64 ఏళ్ల వృద్ధురాలు పేరి మృదుల కుమారి అమలాపురంలోని ఓ బ్యాంక్‌లో సోమవారం రూ.1.42 లక్షలు డ్రా చేసింది. ఆ నగదును బ్యాగ్‌లో పెట్టుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైంది. మార్గం మధ్యలో బండారు లంకలో ఓ కిరాణా దుకాణం వద్ద ఆగింది. ఆ సమయంలో నగదుతో ఉన్న బ్యాగ్‌ను పొరపాటున పడేసుకుంది. ఆ బ్యాగ్ బండారులంకకు చెందిన పెంటపాటి నాగ వెంకట తాయారు(తనూజ)కు దొరికింది. అందులో భారీ మొత్తంలో నగదుతో పాటు బ్యాంక్ పాస్‌బుక్ కూడా ఉంది. అంత డబ్బు తనకు దొరికిన విషయం ఎవ్వరికీ తెలియకపోయినా.. సొంతం చేసేసుకోవాలని తనూజ అనుకోలేదు. ఎంతో నిజాయితీగా పోగొట్టుకున్న వారికి అప్పగించే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈలోగా బ్యాగ్ పోగొట్టుకున్న మృదుల కుమారి అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బండారు లంక వచ్చి విచారణ ఆరంభించారు. ఆ విషయం తెలిసిన తనూజ తనకు నగదుతో దొరికిన బ్యాగ్‌ను చూపించింది. అది మృదుల కుమారిదేనని నిర్ధారణ కావడంతో ఆ నగదు బ్యాగ్‌ను ఆమెకు తనూజ అందజేసింది. ఆమె నిజాయితీకి మెచ్చిన రూరల్ సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్సై ఎ.పరదేశి స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో తనూజను అభినందించి, పోలీసుల తరఫున మంగళవారం ఘనంగా సత్కరించారు.

విధుల్లో చేరిన సబ్జెక్టు టీచర్లు

రాయవరం: పదోన్నతులు, మిగులు, సబ్జెక్టు కన్వర్షన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఈ నెల 22న రాజమహేంద్రవరంలో తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు విడుదల కాలేదు. వెంటనే విధుల్లో చేరాల్సిందిగా వారికి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎస్ నుంచి గణితానికి కన్వర్షన్ కోరిన, పాఠశాలల్లో గణితం మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన 161 మంది, వివిధ కారణాలతో మిగులుగా ఉన్న ఎస్‌ఏ ఇంగ్లిష్ 41, సోషల్ 82, బయలాజికల్ సైన్స్ 43 మందిని సర్దుబాటు చేశారు. అలాగే ఎస్‌జీటీలుగా పని చేస్తున్న వారి నుంచి ఎస్‌ఏ గణితం 110, సోషల్ 49, బయాలజీ 33, ఇంగ్లిష్ 254 మందిని వారు కోరుకున్న స్థానాల్లో సర్దుబాటు చేశారు. సబ్జెక్టు కన్వర్షన్, సబ్జెక్టు మిగులు ఉపాధ్యాయులుగా ఉన్న 327 మందిని, ఎస్‌జీటీ నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులుగా సర్దుబాటు చేసిన 446 మందిని వారు పని చేస్తున్న స్థానాల నుంచి ఇతర స్థానాల్లో సర్దుబాటు చేశారు. వీరందరూ సర్దుబాటు జరిగిన స్థానాల్లో విధుల్లో చేరారు. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత తీరిందని తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

77 ఖాళీ పోస్టులకు కౌన్సెలింగ్

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న 77 పోస్టులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకా ఖాళీలు మిగిలి ఉంటే అన్నీ భర్తీ అయ్యే వరకూ సీనియారిటీ ప్రకారం ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశముంది.

యువకుడి కిడ్నాప్

- రూ.30 లక్షలు ఇవ్వాలని తల్లిదండ్రులకు ఫోన్
- సమిశ్రగూడెంలో ఘటన



అపహరణకు గురైన వెంకటేష్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో యువకుడి కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. కోరుపల్లికి చెందిన నిచ్చెనకోళ్ల రాము, అతడి కుమారుడు వెంకటేష్ (25) నిడదవోలులో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరారు. వెంకటేష్ తన మోపెడ్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి బంక్‌లో ఆగాడు. తండ్రి రాము నిడదవోలు వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో సమిశ్రగూడెం – వేలివెన్ను మధ్య గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి వెంకటేష్‌ను కిడ్నాప్ చేశారు. అతడి మోపెడ్‌ను రోడ్డు పక్కనే పడవేశారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉదయం 7 గంటల సమయంలో వెంకటేష్ సెల్‌ఫోన్ నుంచి కిడ్నాపర్లు కాల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేశారని తండ్రి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్పై పరమహంస పరిశీలించి, కేసు నమోదు చేశారు. వెంకటేష్ ఆచూకీ కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.